

రూ.2 కోట్లతో డిపిఆర్‌సి భవనం

కలెక్టర్ చొరవతో మంజూరు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కేంద్రంలో జిల్లా పంచాయతీ రాజ్ రిసోర్స్ సెంటర్ ఏర్పాటు కానుంది. రెండు కోట్ల రూపాయలతో దీన్ని నిర్మించనున్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం పక్కనే ఉన్న 1.12 ఎకరాల భూమిలో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. జిల్లాలోని పంచాయతీ రాజ్ ఉద్యోగులు, సర్పంచుల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి ఈ భవనం ఉపయోగపడుతుంది. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో తొలుత మన్యం జిల్లాకే మంజూరైంది. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ చొరవతో ప్రభుత్వం ఈ భవనాన్ని మంజూరు చేసింది.

ప్రజా సమస్యలపై సిపిఎం నిరసనలు

కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు



పార్వతీపురంలో ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు


సాలూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్‌వద్ద ధర్నా నిర్వహించారు. అంతకుముందు సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎఒకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ మరోసారి అధికారంలోకి వచ్చిన మోడీ గత కార్పొరేట్, మతోన్మాద విధానాలతో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ వత్తాసు పలుకుతుందన్నారు. ప్రజలపై ఉన్న ఆర్థిక, నిరుద్యోగ భారాలను నిర్మూలిస్తామన్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మోడీ చేతులో కీలు బొమ్మలు మారారని, ప్రజలకు నమ్మక ద్రోహాన్ని తలపెట్టిన గత ప్రభుత్వానికి ప్రజలు పెద్ద ఎత్తున గుణపాఠం తెలిపారని, రానున్న రోజుల్లో అదే పరిస్థితి టిడిపి కూటమికి ఎదురవుతుందని హెచ్చరించారు. ఇకనైనా బిజెపి విధానాలను ఎండగట్టి రాష్ట్ర సంక్షేమ విధానాలకు లోబడి హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తోటపల్లి నిర్వాసితుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని, నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్, రిటైల్ ధరలు తగ్గించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, విద్యుత్ ట్రూ ఆప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, ఉద్యోగుల తొలగింపు ఆపాలని, మహిళలపై, బాలికలపై లైంగిక దాడులు, నేరాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని, దళితులు మైనారిటీలు గిరిజనులపై దాడుల అరికట్టాలని, రాజ్యాంగ వ్యతిరేక జమిలి ఎన్నికల విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బంటు దాసు, గొర్లి.వెంకటరమణ, రెడ్డి.శ్రీదేవి, బంకురు.సూరిబాబు, పాకల సన్యాసిరావు, ఎస్.ఉమా, జి.తులసి, పి.రాజశేఖర్ మరియు నాయకులు ఎం.గౌరీ, పి.రాము, బి.లక్ష్మి, పి.వరాలు, బి.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేశారు..ఈ సందర్భంగా సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు ఎన్‌వై నాయుడు, ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ సాలూరు పట్టణంలో రైతు బజార్‌ను వినియోగంలోకి తేవాలని, స్థలాల్లేని ప్రభుత్వ ఐటిఐ, ప్రభుత్వ లైబ్రరీకి స్థలం కేటాయించాలని, పట్టణంలో గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను వెంటనే ప్రారంభించాలని, నిర్మాణం పూర్తయి, సౌకర్యాలకు నోచుకోని టిట్కో ఇళ్లకు సౌకర్యాలు కల్పించి ప్రజలకు ఇవ్వాలని కోరారు. మండలంలోనిసాగులో ఉన్న భూములకు, గిరిజన ప్రజలకు పట్టాలు ఇవ్వాలని, కురుకూటిలో కట్టాలనుకుంటున్న హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు చేయాలని, అక్రమ మైనింగ్ నిలిపివేయాలని, భూ సమస్యలు హామీలన్నీ అమలు చేయాలని, గిరిజన గ్రామాలు అన్నిటికీ రోడ్లు, వంతెనలు పూర్తి చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాసి, గంగయ్య, సంగీత, శంకర్, వెంకన్న , రవి పాల్గొన్నారు.

కురుపాం : పేద ,సామాన్య ప్రజలపై పెనుభారం పడుతున్న నిత్యవసర సరుకులు ధరల తగ్గించాలని సిపిఎం నాయకులు కొల్లి గంగనాయుడు, ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రజాపోరులో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గిరిజన గ్రామాలకు రోడ్లు వేసి మంచి నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ఎం.రవణమ్మకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకుల అడ్డమేశ్వరరావు, పూలక వాసు, ఇండియా తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం నాయకులు ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.ఈశ్వరరావు మాట్లాడారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. సిపిఎం మండల నాయకులు మంచాల శ్రీనివాసరావు కొర్ర కళ్యాణ్ సుబ్బారావు జర్నీ రామయ్య, పాల్గొన్నారు.

బలిజిపేట :స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యమ్మల మన్మథరావు, గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ ధరల తగ్గింపునకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు బొద్దాన భానుమూర్తి, పిసా వెంకటస్వామి, తిరుపతిరావు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బివి రమణ, కరణం రవీంద్ర మాట్లాడారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దాసరి వెంకటనాయుడు, రెడ్డి సూర్యనారాయణ, కునుకు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, రెడ్డి లక్ష్మునాయుడు, గవర వెంకటరమణ మాట్లాడుతూ సువర్ణ ముఖీనదిపై గల వంతెనను త్వరితగతిన పూర్తి చేయాలని, మండలంలో గల చివర ఆయుకట్టు భూములైన గాదెలవలస, జానుమల్లమ్మవలస, కోట సీతారాంపురంకు వెంగళరాయ సాగర్ కాలువ నుంచి సాగునీరు సరఫరా చేయాలని, ధాన్యం కొలుగోలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.రాము, బి.అప్పారావు, వై.రామారావు, వై.ఈశ్వరరావు, పి. చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : ప్రజాసమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు వి.ఇందిర డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి, నాగభూషణ, లక్ష్మునాయుడు, వెంకట్రావు, గిరిజన సంఘం నాయకులు లక్ష్మయ్య, రామస్వామి, చింతామణి, వెంకట్రావు, రైతు సంఘం నాయకుల ఉపేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివున్నాయుడు, వివిధ గ్రామాల నుంచి ప్రజలు పాల్గొన్నారు.

వీరఘట్టం : పెంచిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ గురువారం స్థానిక తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణకు సిపిఎం మండల కార్యదర్శి ఎన్ సింహాచలం వినతిపత్రం అందజేశారు. తోటపల్లి నిర్వాసితుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

భామిని : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ జగన్ నాయకులు మాట్లాడుతూ కొత్తూరు నుండి బత్తిలి వరకు ఎబి రోడ్డును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని, గిరిజన గ్రామాల్లో పూర్తి స్థాయిలో రక్షిత మంచినీరు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మిన్నారావు, ధర్మారావు అప్పన్న, ఆయూబ్ ఉన్నారు.


గుమ్మలక్ష్మీపురంలో ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

పాలకొండ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పాలకొండ మండల కన్వీనర్ దావాలా రమణారావు మాట్లాడుతూ తోటపల్లి నిర్వాసితులు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. పాలకొండ నగర పంచాయతీలో ఇంటింటా కుళాయి, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మించాలని, రైతు బజారు, పార్కు, స్టేడియం, ఆడిటోరియం నిర్మాణం చేపట్టాలని కోరారు. పాలిటెక్నిక్ కళాశాల, పోస్టు మెట్రిక్ హాస్టల్ స్వంత భవనం నిర్మాణం చేపట్టాలని, తోటపల్లి ఎడమ కాలువ ద్వారా శివారు గ్రామాలకు సాగు నీరు అందించాలని, పాలకొండలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డంపింగ్ యార్డ్ సమస్య, పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దూసి దుర్గారావు, రాము, మజ్జి వీరనాయుడు, మల్లవరపురమేష్, కరణం చంద్రశేఖర్, గోగులనరేష్ పాల్గొన్నారు.

సీతంపేట : నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయంలో డిటి శ్రీవిద్యకు వినతి అందించారు. కార్యక్రమంలో ఆరిక భాస్కరరావు, బి.అప్పారావు, జె.శ్రీరాములు, ఎం.కాంతారావు, సూర్యారావు. పాలక సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : పెంచిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోలక అవినాష్, కార్యవర్గ సభ్యులు మండంగి రమణ, నాయకులు పువ్వల మోహన్రావు, సన్యాసిరావు, ఆడిత్తు, శంకర్రావు ఉన్నారు.

మక్కువ : స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తాడంగి ప్రభాకర్ మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు రోడ్లు వేయాలని, మంచి నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పిట్టల సీతారాం, చంటి తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : నిత్యావసర సరుకులు, విద్యుత్‌ఛార్జీలు, జిఎస్టిలతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై పెనుభారం మోపుతుందని సిపిఎం మండల కార్యదర్శి కూరంగి సీతారాం విమర్శించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అరచేతిలో వైకుంఠంలా రాష్ట్ర బడ్జెట్

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అరచేతిలో వైకుంఠం లా వుందని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. గురువారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం బడ్జెట్లో అంకెల గారడీ చేసిందన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు పై ప్రజలకు ఏ విధమైన భరోసా కల్పించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2,94,627 కోట్లు యితే గతంలో వైసిపి ప్రభుత్వం 2023-24 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ 2,79,279కోట్లని చెప్పారు. కేవలం 15వేల కోట్లు మాత్రమే ఎక్కువని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల తోపాటు 2014నుంచి 2019 వరకు అమలు చేసిన సంక్షేమ పథకాలను కూడా అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని చెప్పారు. ఈ హామీల అమలు పై ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలోనైనా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో ఎస్టీ సంక్షేమానికి రూ.7557కోట్లు కేటాయింపు జరిగిందని, మొత్తం బడ్జెట్ లో 2.56 శాతం మాత్రమేనని చెప్పారు. ఈ కేటాయింపుపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బడ్జెట్‌లో కేటాయించేలా గిరిజన సంక్షేమం కోసం నిధులు ఖర్చు చేస్తే మంచిదేనని రాజన్నదొర అన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ వున్నారు.



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రాథమిక రంగాలు వృద్ధి సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రాథమిక రంగాలైన వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య, అటవీ తదితర శాఖలకు ఇచ్చిన లక్ష్యాలను అధిగమించి, వృద్ధి సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో ప్రైమరీ సెక్టార్ అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో నిమ్మ గడ్డి పెంపకం జరిగేలా చూడాలని, రెండు వేల ఎకరాల్లో నిమ్మగడ్డిని పండిచేలా లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు. నిమ్మగడ్డికి మంచి గిరాకీ ఉందని, ఆ విధంగా రైతులను ప్రోత్సాహించాలని ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆయిల్ ఫాం మరింత విస్తృతపర్చాలని, జీడీ, కొబ్బరి సాగులో జిల్లా ముందంజలో ఉండాలని అన్నారు. ఉద్యానవన పంటల్లో జిల్లా దిగువ స్థాయి నుంచి పై స్థాయికి వచ్చేలా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో దోమలు ఎక్కువగా ఉన్నందున అత్యధికంగా గంబూషియా చేపలు అవసరమని, ప్రస్తుతం ఉన్న రెండు లక్షల సంఖ్య సరిపోదని, ఆ సంఖ్య భారీగా పెరగాలని తెలిపారు. ఇందుకు ఎస్‌హెచ్‌జిల ద్వారా చేపలు తయారు చేయాలన్నారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని, తద్వారా వారికి ఉపాధి కల్పించినట్లు అవుతుందని పేర్కొన్నారు. గంబూషియా చేపల పెంపకం చేసేలా ఆదర్శవంతమైన ఫార్మ్ సిద్ధం చేయాలని, జిల్లాలో వినియోగించుకోగా మిగిలిన అదనపు చేపలను ఇతర జిల్లాలకు సరఫరా చేయవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి పాఠశాలలో మొక్కలు పెంచే కార్యక్రమం ఉందని, అందుకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేయాలని అన్నారు. ముఖ్యంగా పండ్ల మొక్కలపై దృష్టి సారించాలని, అటవీశాఖతో పాటు పలు నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో పాలు, మాంసం విక్రయాలు మరింత పెరగాలని, ఇందుకు యూనిట్లను స్థాపించి లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి జి.ఎ.పి.ప్రసూన, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా ఉద్యానవన అధికారి కె.ఎస్.వరప్రసాద్, జిల్లా మత్స్య శాఖాధికారి వి.తిరుపతిరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. ఎస్.మన్మథరావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు శిక్ష

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధించినట్లు ఎస్‌పి ఎస్‌విమాధవ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జియ్మజిల్లా చినమేరంగి పోలీసు స్టేషనులో 2019లో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి గురువారం తీర్పు వెల్లడించినట్లు తెలిపారు. పోలీసుల తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటరు మావూరి శంకరరావు వాదనలు వినిపించగా, చినమేరంగి ఎస్‌ఐ పి.అనీష్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ సిహెచ్‌చ్. లలిత, సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పర్చారు. ఈ కేసులో నిందితుడుకి శిక్షపడేలా వాదనలు వినిపించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటరు శంకరరావును, అప్పటి దర్యాప్తు అధికారి అయిన ఎస్‌ఐ బి.శివప్రసాద్, ప్రస్తుత చినమేరంగి ఎస్‌ఐ పి.అనీష్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ లలితను ఎస్‌పి అభినందించారు.

పన్నుల వసూళ్లకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో పన్నులు వసూలుకు కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యాన రెవెన్యూ అధికారులు గురువారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. పెదమార్కెట్‌లో షాపుల నుంచి రావాల్సిన పన్ను బకాయిలపై ఆయన దృష్టి సారించారు. మార్కెట్‌లో షాపుల వద్దకు వెళ్లి యజమానులకు కమిషనర్ అవగాహన కల్పించారు. పట్టణాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. దీంతో వ్యాపారులు రూ.లక్షా 20వేలు చెల్లించారు.

మరణించినా జీవించాడు

- బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడు అవయవ దానం
- గ్రీన్‌ఛానల్ ద్వారా విశాఖకు, అక్కడి నుంచి చెన్నైకు తరలింపు

ప్రజాశక్తి-విజయనగరం కోట/పాచిపెంట

ఆ యువకుడు మరణించినా జీవించే ఉంటాడు. రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు బ్రెయిన్‌డెడ్ కావడంతో అతడి అవయవాలను దానం చేసి ఆ తల్లిదండ్రులు మరో నలుగురికి ప్రాణం పోశారు. జిల్లా చరిత్రలోనే తొలిసారి ఇలాంటి సంఘటన చోటు చేసుకుంది.


అవయవాలను తరలిస్తున్న అంబులెన్స్

పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన లంకేన సాయి కుమార్ (21) ఈనెల 12న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తిరుమల -మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్‌తో మృతి చెందాడు. ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు కుమారుడి అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో సాయికుమార్ గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులను జీవన్‌దాన్ సభ్యుల సహకారంతో భద్రపర్చిన వైద్యులు నాలుగు అంబులెన్సులు, ఒక కారులో విజయనగరం మెడికవర్ నుంచి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నడుపుతున్న లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ద్వారా గ్రీన్ ఛానల్‌లో విశాఖ ఎయిర్ పోర్టుకు తరలించారు. అక్కడి నుంచి విమానంలో చెన్నై తరలించారు. మెడికవర్ ఆసుపత్రి నుండి విశాఖ ఎయిర్ పోర్టుకు అవయవాల తరలింపునకు ట్రాఫిక్ పోలీసులు ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. విజయనగరం ట్రాఫిక్ సిఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ శంభాన రవి పైలట్‌గా జిల్లా సరిహద్దు అయిన రాజాపులోవ వరకు తరలించగా, అక్కడ నుండి విశాఖపట్నం సిటీ పోలీసులు అంబులెన్సు, ఇతర వాహనాలకు గ్రీన్ ఛానల్ ద్వారా పైలట్ చేశారు.

సాయికుమార్ తల్లిదండ్రులు లంకేన లక్ష్మణరావు, శ్రీదేవి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కమారుడు సాయికుమార్, కుమార్తె స్రవంతి ఉన్నారు. సాయికుమార్ పదో తరగతి వరకు చదువుకొని


సాయికుమార్ మృతదేహం

మానేసి ఆర్‌టిసి హైర్‌బస్సుకు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్రవంతి ప్రస్తుతం ఇంటర్ చదువుతోంది. సాయికుమార్ తాతగారి ఇంటి వద్ద మక్కువలో ఉంటూ రోజూ స్వగ్రామం వెళ్లి వస్తుంటాడు. ఆ క్రమంలో మంగళవారం రాత్రి కొత్తవలస నుంచి మక్కువ బైక్‌పై వస్తుండగా దుగ్గేరుసమీపంలో తీవ్రంగా గాయపడి పడిఉన్న అతడిని స్థానికులు పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విజయనగరంలోని తిరుమల -మెడికవర్ ఆసపత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేసినా ఫలితం లేకపోయింది. మృతదేహాన్ని అంబులెన్సులో స్వగ్రామం కొత్తవలస తరలించారు. గ్రామస్తులు, యువత పెద్దఎత్తున హాజరై అవయవదాతకు జోహార్లు అంటూ నివాళులర్పించారు. ఇదిలా ఉండగా సాయికుమార్ మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసినట్లు ఎఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి - వీరఘట్టం

జిల్లాలోని పలుచోట్ల బాలల దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా వీరఘట్టం మండలంలోని నీలానగరం, కంబర వలస, దశమంతపురం తదితర గ్రామాల్లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నీలానగరంలో విద్యార్థులచే కోలాటం, డాన్స్ నిర్వహించారు. కంబర వలస పాఠశాల ఆవరణలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి.రవి ప్రసాద్, వై.లక్ష్మి, ఎం.పైడిరాజు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాచిపెంట : నీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం మండలంలోని భీమందొరవలస, నీలంవలస, పనుకువలస, గుమ్మివలస, పనసపాడు, మూలవలస మొదలైన గ్రామాల్లో బాలలతో ఆటల పోటీలు పెట్టి బహుమతులు అందజేశారు. అనంతరం బాలహక్కులు కాపాడాలని, బాలలను పనిలో పెట్టరాదని, బాల హక్కులను భంగం కలిగించకూడదని, బాలల విద్య, సంక్షేమం, భవిష్యత్తు భద్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం మనపై ఉందని నీడ్ డైరెక్టర్ పి. వేణుగోపాలరావు తెలిపారు. నీడ్ బృందం మహిళా వాలంటీర్లు, మహిళా కోఆర్డినేటర్ కనకరత్నం, మహేష్, కె.మోహన్‌రావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, మహిళలు, పిల్లలు అందరూ గ్రామంలో నినాదాలతో ర్యాలీ చేశారు.

సీతంపేట : స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చాచా నెహ్రూ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు బాలల ఆకృతిలో నిలవడం పలువుర్ని ఆకట్టుకున్నాయి. బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వాటి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసంత లక్ష్మి, వసతిగృహ అధికారి పాలక అమల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


సీతంపేట : బాలల దినోత్సవం ఆకృతిలో ఉన్న విద్యార్థులు

పార్వతీపురంటౌన్ : స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా డివియం ఉన్నత హైస్కూల్లో జాతీయ బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎఎస్‌పి అంకిత సురానా విద్యార్థులకు నైతిక విలువలు, నైపుణ్యాలపైన బాల బాలికలకు క్లుప్తంగా వివరించారు. భవిష్యత్తులో నైతిక విలువలు, ఉపయోగం, బాలల చట్టాల గురించి తెలిపారు. ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి ఆడపిల్లలు తెలుసుకోవాల్సిన గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రాజ్యలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎ.సత్యనారాయణ, స్కూల్ ప్రిన్సిపల్, సిబ్బంది స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాల సంరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ : బాలల హక్కుల వారోత్సవాలు గురువారం జన చేతన సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, పెదకాపు వీధి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ముందుగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సదస్సులో ఏపీ ప్రో చైల్డ్ గ్రూప్, క్రాప్ వారు బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై రూపొందించిన గోడ పత్రిక ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకులు, జనచేతన సంస్థ కార్యదర్శి బగాది శశి భూషణ చౌదరి మాట్లాడుతూ పిల్లల హక్కుల సంరక్షణకు ప్రభుత్వం రూపొందించిన చట్టాలపై అవగాహన కల్పించారు. పెదకాపు వీధి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ సోమేశ్వరరావు, బాలికల పాఠశాల ఇంచార్జ్ చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చదువుకునేందుకు కావాల్సిన భోజన, వసతి, బట్టలు, మందులతో పాటు ఇతర ఖర్చుల నిమిత్తం అమ్మఒడి లాంటి పథకాలతో తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేకుండా చూస్తుంది, కావున పిల్లలంతా తప్పనిసరిగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.రాంబాబు, ఎం.విద్యాలత, కె.గౌరీశ్వరి, జి.శ్రీదేవి, ఎస్.నానిబాబు, బి.తిరుపతి రావు, శ్రీదేవి, భారతరత్నం ఉషా, పాఠశాలల పిల్లలు పాల్గొన్నారు.



పాచిపెంటలో బాలల హక్కులపై ర్యాలీ చేస్తున్న నీడ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

పార్వతీపురంలో ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈనెల 17న ఎపి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ పార్వతీపురం మన్యం జిల్లా ర్యాంకింగ్ టోర్నమెంట్ జరగనుందని శ్రీ చెస్ కోచింగ్ సెంటర్ అధినేత వి.వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు 6 విభాగాల్లో జరుగుతాయన్నారు. అండర్ -6, -8, - 10, - 12, - 14 -16 విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు ఆదివారం ఉదయం 8గంటలకే హాజరుకావాలని, తప్పనిసరిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులచే ధృవీకరించిన స్టడీ సర్టిఫికెట్లను, పుట్టినతేదీతో సహా సమర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రూ. 50, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు రూ.100 ప్రవేశ రుసుంగా చెల్లించి, ఈనెల 16న సాయంత్రం 5 గంటల్లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 62812 95572 నెంబరును సంప్రదించవలసిందిగా కోరారు.

21న మున్సిపల్ షాపుల వేలం

పార్వతీపురం టౌన్ : స్థానిక మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న ఏడు షాపులకు ఈనెల 21న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ (ఎఫ్‌ఎసి) శ్రీనివాసరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు వేలంపాటలో పాల్గొనాలని, ఈ షాపులను రిజర్వేషన్ ప్రాతిపదికన కేటాయించినట్లు తెలిపారు. మిగతా సమాచారం కోసం కార్యాలయ పని దినాల్లో రెవెన్యూ విభాగం అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఆటిజం నివారణకు చర్యలు తీసుకోవాలి

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే విజయచంద్ర

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆటిజం వ్యాధి ఎదుర్కొంటున్న చిన్నారుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని, ఈ సమస్యపై ప్రభుత్వం పరిష్కారం చూపాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అసెంబ్లీలో ప్రస్తావించారు. గురువారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలు భవిత కేంద్రాల్లో ఆటిజం బాధితులకు పూర్తిస్థాయిలో వైద్య సౌకర్యాలు కల్పించడంలేదనివివరించారు పుట్టిన సమయంలోనే ఆటిజాన్ని గుర్తించేందుకు తల్లిదండ్రులకు అవగాహన లేదని, దీనిపైన అవగాహన కల్పిస్తే తొలిదశలోనే ఆ రుగ్మతను కొంతైనా తగ్గించేందుకు అవకాశం ఉంటుందని, అటువంటి చర్యలు ఏమైనా తీసుకునే అవకాశం ఉందా అని ప్రశ్నించారు. భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ సేవలు అందుతున్నాయని, ఆటిజం పిల్లలకు మరింత మెరుగైన సేవలు కల్పించేలా వైద్యారోగ్య శాఖ మంత్రి చర్యలు తీసుకునేలా ఉపయోగం ఉంటుందని సూచించారు.

సూపర్‌సిక్స్ హామీలతో మోసం : అలజంగి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సూపర్ సిక్స్ హామీల ప్రస్తావన లేకుండా బడ్జెట్ ప్రకటించి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మోసగించారని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రశ్నిస్తూ కింద నీవు ఇచ్చిన పథకాల అమలు ఎప్పుడని ప్రశ్నించారు. నాడు ప్రజలకు ఇన్ని హామీలు ఇచ్చి నేడు వాటి ప్రస్తావన లేకుండా ప్రజలను నిలువునా మోసం చేసిన దీనిపై 420 కేసు ఎందుకు పెట్టకూడదు? అని ఆయన నిలదీశారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఇందుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కె.బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక వనరులతో గ్రామాలు అభివృద్ధి

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల అభివృద్ధికి ఆర్థిక వనరులను సేకరించాలని ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెడిపిపై పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ నిర్వహించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై ముందస్తు ప్రణాళికలతోనే గ్రామ స్వరూపం భౌగోళిక పరిస్థితులను అనుసరించి ఆర్థిక వనరులు సేకరించాలని, వాటితో గ్రామాలకు చెందిన వివిధ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు శ్రీనివాసరావు, మనోజ్ కుమార్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన కార్యదర్శులు, డిఎలు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన అధికారులు

ప్రజాశక్తి - పాచిపెంట

పల్లె నిద్రలో భాగంగా మండలంలోని పలు ఆశ్రమ పాఠశాలను గురువారం అధికారులు సందర్శించారు. బడ్డాయివలస బాలుర ఆశ్రమ పాఠశాలను తహశీల్దార్ డి.రవి సందర్శించి పల్లె నిద్ర చేశారు. పాచిపెంట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఎంపిడిఒ బివిజె పాత్రో, సరాయివలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సాలూరు ఎంపిడిఒ, పి.కోనవలస ఆశ్రమ పాఠశాలను పాలకొండ ఎంపిడిఒ సందర్శించి పల్లె నిద్ర చేశారు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు మండలంలోని అరసాడ వైద్యాధికారికి గురువారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆశాలు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పని భారం తగ్గించాలని, కొత్త సెల్ ఫోన్లు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్, మట్టి ఖర్చులు, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలపై ఈనెల 18న పార్వతీపురంలో జరుగు కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు.



వైద్యాధికారికి వినతిని అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

అగ్నిమాపక సేవలపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మల్లి గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సత్యనారాయణ, కేంద్ర సిబ్బంది అగ్నిమాపక అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన వారిని సురక్షిత ప్రదేశానికి తరలించి, ఊపిరితిత్తుల్లో చేసిన విష వాయువులు లేదా అధిక మింగిన నీరు బయటకు వచ్చేలా చేయు సిల్వర్ పద్ధతిని తర్ఫీదు చేయించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ధర్మారావు శ్రీరామ్మూర్తి, వైస్ ప్రిన్సిపల్ కిల్లి వరహా నరసింహం, స్కూల్ ప్రిన్సిపల్ బి.రోహిణి వాసుదేవరావు, వైస్ ప్రిన్సిపల్ కె.కిషోర్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.రవి, ఎం.రామారావు పాల్గొన్నారు.

పోసానిపై టిడిపి నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకొండ

టిటిడి చైర్మన్, టీవీ 5 అధినేత బిఆర్ నాయుడుపై వైసిపి నాయకుడు నటుడు పోసాని కృష్ణమురళి చేసిన అనుచిత వ్యాఖ్యలు, అసభ్యకరమైన పదజాలంతో దూషించడం పట్ల పాలకొండ టిడిపి నేతలు పాలకొండ పోలీసు స్టేషన్‌లో పోసానిపై ఫిర్యాదు చేశారు. వెంటనే పోసానిపై కేసునమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ ప్రయోగమూర్తికి పట్టణ 15,9 వార్డుల ఇన్‌ఛార్జ్ బాగాది వెంకటరమణ, అనావు జనరాజు ఆధ్వర్యంలో ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

27 నుంచి ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఈనెల 27 నుంచి 30 వరకు విజయనగరంలో ఎఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని, వీటిని విజయవంతం చేయాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో మహాసభలకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి ఎం.భీమరాజు, బి.రవికుమార్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు అధికారులు చొరవ చూపాలని సిపిఎం మండల కార్యదర్శి ఎన్.సింహాచలం డిమాండ్ చేశారు. గురువారం వసతి గృహం సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. ఆరో నుండి పదో తరగతి 16మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారని, వీరంతా వీరఘట్టం లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యను కొనసాగించడం వల్ల అక్కడ మధ్యాహ్న భోజన సదుపాయం లేకపోవడంతో వసతి గృహంలోని ఏర్పాటు చేస్తున్నారని, అయితే మెనూ ప్రకారం అమలు చేయాల్సిన భోజనం ఇక్కడ సరిగ్గా అమలు చేయడం లేదని అన్నారు. మంచినీటి ఫిల్టర్ ట్యాంకు మొరాయించడంతో నేరుగా మోటర్ ద్వారా వచ్చే నీటితోనే కాలం గడుపుతున్నట్లు ఆయన విమర్శించారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి మెనూ ప్రకారం విద్యార్థు లకు రుచికరమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

22న ప్రతిభా పరీక్ష నిర్వహించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మై స్కూల్ - మై ప్రైడ్ లో భాగంగా ప్రభుత్వ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు ఈనెల 22న ప్రతిభ పరీక్షను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుంచి ఎంఇఒలు, తహశీల్దార్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరి కాకుండా, ఈసారి ఆంగ్ల భాషలో పది పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. తెలుగు, హిందీ మినహా మిగిలిన అన్ని పరీక్షలు ఆంగ్లంలో రాయాల్సి ఉందని తెలిపారు. అందువల్ల మండల ప్రత్యేక అధికారులు పల్లె నిద్రలో భాగంగా శుక్రవారం ఈ ప్రతిభ పరీక్షను నిర్వహించి, పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరీక్ష ద్వారా విద్యార్థుల్లో ఉండే ప్రతిభను గుర్తించవచ్చని, తద్వారా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక తరగతులను నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, ఎంఇఒలు, తహశీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఉపాధి ఎపిడి జి.శ్రీహరిరావు లబ్ధిదారుల్ని హెచ్చరించారు. మండలంలోని దశమంతపురంలో రూ.2.39 లక్షలతో నిర్మిస్తున్న గోకులం షెడ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరగా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని లబ్ధిదారులకు సూచించారు. ఆయనతో పాటు ఎపిఒ జి.సత్యంనాయుడు, మాజీ సర్పంచ్ ఎ.కుమార స్వామి, టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

గ్రంథాలయాలు దేశ భవితకు పునాదిరాళ్లు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

విజ్ఞానం పెంపొందించుకొనేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదం చేస్తాయని జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షులు టి.శివకేశవరావు అన్నారు. గురువారం గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలనే కాకుండా, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాలు ఎస్ఎల్ పాత్రుడు మాట్లాడుతూ దేశ భవితకు గ్రంథాలయాలు పునాదిరాళ్ళని అన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. దేశాన్ని అభివృద్ధి పదంలో నడిపించే వీరులుగా యువత ఎదగాలని అన్నారు. బడి, తోటలు పెంచడం, కత్యాధార విద్యను జట్టు ట్రస్ట్ విద్యార్థులకు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ ఛైర్మన్ డి.పారినాయుడు, బడి తోట కో ఆర్డినేటర్ శివాజి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక శాఖా గ్రంథాలయంలో ఎంఇఒ -2 సతీష్ కుమార్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆది ఆంధ్ర స్కూల్ ఉపాధ్యాయులు ఉషారాణి, విద్యార్థులు, సరస్వతి శిశు మందిర్ హెచ్ఎం సూర్యనారాయణ, చిన్నారులు ఈ వారోత్సవాల్లో పాల్గొన్నారు. బ్రాంచ్ లైబ్రరియన్ ఉదయ భాస్కర్ అధ్యక్షత వహించారు. విద్యార్థులకు మిఠాయిలు అందించారు.

గుమ్మలక్ష్మీపురం : చాచా నెహ్రూ జన్మదిన వేడుకలు స్థానిక గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రంథాలయాల విశిష్టత విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లైబ్రరియన్ డి సుకన్య , ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సంధ్యారాణి, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ సందీప్, మహిళా పోలీస్ లక్ష్మి ఉన్నారు.

ఐటిఐ, పాలిటెక్నిక్ విద్యార్థులు హాస్టళ్లలో సేవలందించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ఐటిఐలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ వసతి గృహాల్లో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కోరారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని, అందులో భాగంగా ఈ పనులు చేపట్టాలని అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐటిఐలు, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలతో ఆయన సమీక్షించారు. సాంకేతిక విద్య, పరిశ్రమల శిక్షణ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ వసతి గృహాల్లో సేవలు అందించడం వల్ల ప్రాజెక్టు వర్క్‌గా ఉపయోగ పడుతుందని, తద్వారా హాస్టల్స్ లో వసతులు మెరుగుపడతాయని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఇందుకు అవసరమైన సామాగ్రిని అందజేస్తామని, మెరుగైన వసతి గృహాలుగా తీర్చిదిద్దేందుకు కొత్త ఆలోచన చేయాలని అన్నారు. విద్యార్థులు వారికి దగ్గరలో గల వసతి గహాలను సందర్శించి, వారు నేర్చుకున్న పనులు చేపడితే సరిపోతుందనిసూచించారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వెల్డింగ్, ఫిట్టర్ తదితర శిక్షణ పొందిన విద్యార్థులు నేర్చుకున్న విద్యను బహిర్గతం చేయాల్సి ఉందని, అందుకు ఈ సేవలు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. సమావేశంలో జిల్లా వత్తి విద్యాశాఖాధికారి మంజుల వాణి, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐలు, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్, లెక్చరర్స్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం, పాడేరు, సీతంపేటమన్యంలో జరుగు తున్న గిరిజన విద్యార్థుల మరణాలపై రాష్ట్ర గవర్నర్‌కు, జాతీయ మానవ హక్కుల సంఘం, జాతీయ ఎస్టి కమిషన్ దృష్టికి తీసుకెళ్లి నట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ తెలిపారు. ఎఎన్ఎంలను నియమించ డానికి, మృతి చెందిన గిరిజన విద్యార్థి కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థుల మృతికి టీచర్లను బాధ్యులు చేస్తే ఎలా? : యుటిఎఫ్

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు మరణానికి ఐటిడిఎ అధికారులు తగు చర్యలు తీసుకొని సమీక్షించడం సంతోషకరమని, అయినా ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఉపాధ్యాయులను బాధ్యులు చేస్తే ఎలా అని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్, ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు గురువారం వారు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. విద్యార్థుల ఆరోగ్యం చూసుకోవడానికి ఎఎన్ఎంను, రాత్రిపూట అత్యవసర సమయంలో చూడ్డానికి వాచ్మెన్‌ను ప్రభుత్వం నియమించాలని, అలా ఎవర్నీ నియమించకుండా విద్యార్థుల మరణానికి ఉపాధ్యాయులను బాధ్యులు చేస్తూ షోకాజ్ నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. విద్యార్థికి ఆరోగ్యం బాగా లేకపోతే స్వచ్ఛందంగా ఉపాధ్యాయులు వారి సొంత డబ్బులతో తీసుకెళ్లి వైద్యం చేయిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఆటలు ఆడించకపోవడం వల్ల జ్వరాల బారినపడుతు న్నారనడం సమంజసం కాదని, పాఠశాలకు ఒక్క పీడీ మాత్రమే ఉన్నారని, అయినా రెండు పూటలా ఆటలాడిపిస్తున్నారని అన్నారు. గురుకుల పాఠశా లలతో గిరిజన ఆశ్రమ పాఠశాలలను పోల్చడం సమంజసం కాదన్నారు. గురుకుల పాఠశాలలో పూర్తిస్థాయి సిబ్బంది ఉంటారని, ఆశ్రమ పాఠశాలలో సిబ్బంది ఉండరని అవి గ్రహించి ఎఎన్ఎ, వాచ్మెన్ , మిగతా సిబ్బందిని పూర్తిస్థాయిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నియమించాలని డిమాండ్ చేశారు.

జీతాలు సక్రమంగా చెల్లించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

స్థానిక మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పాలకవర్గం, అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని, దీనికి ఉదాహరణ అక్టోబర్ జీతం నేటికీ అందని పరిస్థితి ఉందని, ఇదే విధానాన్ని అవలంబిస్తే మున్సిపల్ కౌన్సిల్ రోజున ఆందోళన చేస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు గురువారం కమిషనర్‌కు వినతి పత్రాన్ని కమిటీ అధ్యక్షులు టి.శంకర్రావు, కమిటీ నాయకులు రవి, వెంకన్న, వెంకట్రావు, యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కార్మికులకు ప్రతినెలా ఒకటో తేదీకి జీతాలు ఇవ్వాల్సి ఉన్నా అక్టోబర్ నెల జీతం నేటికీ ఇవ్వలేదన్నారు. దీంతో దీపావళి, నాగుల చవితి పండుగులకు కార్మికులు జీతాలు లేకుండానే ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. నవంబర్ నెల జీతమైన సక్రమంగా బిల్లు పెడితేనే డిసెంబర్ మొదటి వారానికి వస్తుందని, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నేటికీ హామీ అమలు చేయలేదని అన్నారు. జీవో 36 ప్రకారం డ్రైవర్ల వేతనాలు రూ.24,500 చెల్లించాల్సి ఉన్నా నేటికీ అమలు కాలేదన్నారు. ఈ సమస్యలు పరిష్కారం కానీ ఎడల ఈ నెలలో జరిగే కౌన్సిల్ సమావేశంలో ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ కార్మికులతో మాట్లాడుతూ జీతాలు సక్రమంగా చెల్లించేందుకు కృషి చేస్తామని మిగిలిన పెండింగ్ సమస్యలను జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



పెట్రోలు బంకు ఏర్పాటు ప్రదేశం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, రజకులు

పెట్రోల్ బంక్ ఏర్పాటు ఆపాలి

ప్రజాశక్తి - కొమరాడ

రజకుల జీవితాలను నాశనం చేసే పెట్రోల్ బంక్ ఏర్పాటును తక్షణమే ఆపాలని సిపిఎం నాయకులు వి.ఇందిర, కొల్లి సాంబమూర్తి అన్నారు. గురువారం జిసిసి పెట్రోల్ బంకు ఏర్పాటు చేసే ప్రదేశం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో రజకులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం సర్వే డిటి హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చెరువులో బట్టలు ఉతుక్కుంటూ కుటుంబాలు నెట్టుకు వస్తున్న సమయంలో జిసిసి పెట్రోల్ బంక్ ఏర్పాటుతో తమ పనికి తీవ్ర ఆటంకం కలుగుతుందని అన్నారు. గతంలో ఇదే స్థలంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంలో ప్రజలు వ్యతిరేకించడంతో జిసిసి అధికారులు కొంత వెనక్కి జరిగి మళ్లీ ఇప్పుడు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ఏదైనా జరగరాని సంఘటన జరిగితే ఎంతోమంది విద్యార్థులతో పాటు ప్రజలకు రక్షణగా ఉన్న పోలీస్ స్టేషన్, చెరువు వద్ద బట్టలు ఉతుక్కుంటున్న రజకుల పరిస్థితి ఏమిటని అన్నారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుతో కొంతమందికి ఉపాధి కలుగుతుంది, అలాగే భవిష్యత్తులో జరగబోయే నష్టాన్ని కూడా అంచనా వేయాలని అధికారులకు సూచించారు. కావున ఈ విషయాన్ని అధికారులు అర్థం చేసుకొని పెట్రోల్ బంకును వేరే చోట ఏర్పాటు చేయాలని కోరారు. నిరసనలో ఆది, రమణ, సూరమ్మ, శివుడు, గౌరి పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సెట్విజ్ సిఐ బి.రామ్ గోపాల్ అన్నారు. మండలంలోని గొట్టివాడ సచివాలయం వద్ద ఎస్.సొసైటీ అధ్యక్షులు ఎస్‌కె గౌస్ ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై ర్యాలీ నిర్వహించి అనంతరం సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి వేగంగా వెళ్ళడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, మనం ప్రయాణం వేగం వల్ల మనతో పాటు కుటుం బాలకు కూడా నష్టం కలిగించేలా జరుగుతున్నా యని అన్నారు. కావున ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు నాణ్యమైన హెల్మెట్‌ను వాడాలని, ఇలా వాడడం వల్ల ప్రమాద తీవ్రత తగ్గుతుందని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ అశ్విని, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు సంతోష్ , గ్రామ పెద్దలు శంకర్ రావు, కోటి, సుందరరావు ,వాసు పాల్గొన్నారు.

వీరఘట్టం : ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి క్షేమకరమైన ప్రయాణం సాగించాలని స్థానిక ఎస్సై జి కళాధర్ వాహనదారులకు సూచించారు. మండలంలోని యు.వెంకంపేట పంచాయతీ పరిధి మరియగిరి పుణ్యక్షేత్రం వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరు కూడా నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌సి వాసునాయుడు, సిబ్బంది, వాహనదారులు ఉన్నారు.

సీతానగరం : చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని గాదెలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్న అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే మత్తు పానీయాలకు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థి దశలోనే సమాజం పట్ల అంకితభావంతోనే ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పద్మనాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 25 నుంచి సమ్మెకు సిద్ధమవుతున్నట్లు 108 అంబులెన్స్ ఉద్యోగుల సంఘం నాయకులు ప్రకటించారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సమావేశంలో 108 అంబులెన్స్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గొర్లె అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి తెర్లి వెంకటరమణ, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కన్వీనర్ బివి రమణ మాట్లాడుతూ 108లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు నేటికీ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ సదుపాయాలైన గ్రాడ్యుటీ, పెన్షన్ కల్పించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నేరుగా 108 అంబులెన్స్ వ్యవస్థను నిర్వహించాలని, ప్రైవేట్ సర్వీస్ ప్రొవైడర్లకు అప్పగించడం వల్ల ఈ సేవల్లో నాణ్యత కొరవడుతుందని విమర్శించారు. ప్రస్తుతం 108 సర్వీస్ ప్రొవైడర్‌గా ఉన్న అరబిందో కంపెనీ చెల్లించాల్సిన పిఎఫ్ వాటా మొత్తాన్ని చెల్లించుకుండా పూర్తిగా కార్మికుల వద్దనుండే వసూలు చేయడం కార్మికులకు పెను భారంగా మారిందని ఇది చట్ట వ్యతిరేకమైన చర్యని విమర్శించారు. 108 అంబులెన్స్ వాహనాలకు ప్రతి ఏటా చేయించాల్సిన ఫిట్నెస్ పరీక్షలు చేయడం లేదని, ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచేందుకు చర్యలు చేపట్టాలని, అరబిందో కంపెనీ నుంచి రావలసిన వివిధ రకాల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. తక్షణమే తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఈనెల 25నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, 108 ఉద్యోగ సంఘం నాయకులు తెంటు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నిరవధిక సమ్మె కరపత్రాలను విడుదల చేస్తున్న 108 అంబులెన్స్ ఉద్యోగులు

విద్యార్థి దశలోనే చట్టాలను తెలుసుకోవాలి : ఎఎస్‌పి

ప్రజాశక్తి - సీతంపేట

విద్యార్థి దశలోనే చట్టాల గురించి తెలుసుకోవాలని ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్ అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి తెగల అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన సదస్సు స్థానిక ఐటిడిఎ సమావేశం మందిరంలో ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలల విద్యార్థులకు పిఒఎ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ చదువుతో పాటు చట్టాల గురించి అవగాహన కల్పించుకోవాలన్నారు. విద్యార్థులు మన పరిధిలో ఉన్న చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. ఉద్యోగాలకు సంబంధించిన ఇంటర్వ్యూలో కూడా చట్టాల గురించి అడుగుతారని చెప్పారు. మైనర్ బాలిక ఫోక్స్ చట్టాలు, దళిత, గిరిజనుల అట్రాసిటీ కేసుల గురించి వివరించారు సుమోటో కేసులు ప్రత్యేక కోర్టుల గురించి అవగాహన కల్పించారు. సిఐడి డిఎస్‌పి ఎంఎన్ భూపాల్ మాట్లాడుతూ బాధితులకు చట్టాల వల్ల ఉపయోగాలు గురించి అవగాహన కల్పించారు. తొలుత ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి వెలిగించారు. కార్యక్రమంలో పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు, తహశీల్దార్ అప్పలరాజు, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ మంగవేణి, శ్రీకాకుళం జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురాం, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీ ప్రభాకర్ రావు, గిరిజన హక్కుల జెఎసి అధ్యక్షులు శ్రీనివాసరావు, సిఐడి ఇన్‌స్పెక్టర్లు బి.చలపతి రావు, వేణుగోపాలరావు, స్థానిక ఎస్సై వై.అమ్మనరావురావు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎఎస్‌పి దిలీప్‌కిరణ్

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సీతంపేట ఎమ్మెమ్మెస్‌లో గురువారం సర్పంచ్‌లకు ఎంపిటిసిలకు, జెడ్‌పిటిసిలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి ఆదినారాయణ, ఇఒపిఆర్‌డి కె.సత్యం మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే ప్రణాళిక తయారు చేసుకొని నిధులతో అభివృద్ధి చేయాలన్నారు. 2025-26 సంబంధించి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక నిధులపై ప్రణాళిక తయారు చేయాలన్నారు. పంచాయతీ అవసరాలను గుర్తించి ప్రణాళిక తయారు చేయాలన్నారు. అంతకుముందు బాలల దినోత్సవ సందర్భంగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి లక్ష్మి, సర్పంచులు, మోటివేటర్లు పాల్గొన్నారు

గంజాయి సాగు చేయరాదు

ప్రజాశక్తి - మక్కువ

గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చే పోడు భూముల్లో గంజాయి సాగు చేయకూడదని మండల ఫారెస్ట్ అధికారి కె.నారాయణరావు తెలిపారు. మండలంలోని దుగ్గేరు వారపు సంతలో గురువారం గిరిజనులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గంజాయి సాగు చేయడం నేరమని, గంజాయికి బానిస కావడం వల్ల అనేకమంది జీవితాలు నాశనమయ్యాయని గిరిజనులకు తెలియజేశారు. సంతకు వచ్చే ఎఒబి గ్రామాలైన సిరివర, చిలకమెండింగి, పోయిమల, తాడిపుట్టు, దోహేవర, దుగ్గేరు, జిల్లేడువలస, దిగువ కేసలి గ్రామ ప్రజలందరికీ గంజాయి సాగు, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, ఎఒబి సరిహద్దు గ్రామాల్లో ప్రజలకు కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీట్ అధికారులు శ్రీనివాసరావు, గణపతి, సతీష్ కుమార్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పాత బస్టాండ్ సమీపాన గల సాయిరాం స్వీట్స్ బేకరీ ముందు ఉన్న కలాసీల విశ్రాంతి షెడ్‌లో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు పట్టణ ఎస్సై గోవిందరావు ఘటన స్థలానికి వచ్చి పరిసర ప్రాంతాల్లో ఉన్న దుకాణాల యజమానుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

438 నాటు సారా ప్యాకెట్లతో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కురుపాం నియోజకవర్గం కొమరాడ మండలం, విక్రంపురంలో దాడులు నిర్వహించి రెండు ప్లాస్టిక్ సంచుల్లో గల 340 నాటుసారా ప్యాకెట్లుతో ఇదే మండలం గుమడకు చెందిన దేవులపల్లి నగేష్‌ను అరెస్ట్ చేసి నాటుసారా ప్యాకెట్లు కూడా స్వాధీనపర్చుకొని నిందితుడ్ని అరెస్టు చేసిరిమాండ్‌కు తరలించినట్టు ఎక్సైజ్ సిఐ సురేష్ తెలిపారు. ఈ కేసుతో పాటు ఇఎస్‌టిఎఫ్ పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలోలో దాడులు నిర్వహించి 98 సారా ప్యాకెట్లుతో ఇందిరా కాలనీ, కొత్తవీధికి చెందిన వండాన అప్పారావు, 40 లీటర్లు సారాతో నవిరి కాలనీకి చెందిన మీసాల రవిని అరెస్ట్ చేసి, సారాను స్వాధీన చేసుకున్నారు. ఈ ఇద్దరి నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సిఐ తెలిపారు.

75 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పి.కోనవలస చెక్పోస్ట్ సమీపంలో గురువారం ఒడిస్సా రాష్ట్రం లవ్దికి చెందిన ఐదుగురు మహిళల నుంచి 75 లీటర్లు నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు. నాటు సారా తరలిస్తున్న ఐదుగుర్ని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

34 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బలిజీపేట మండలం సుభద్రలో దాడులు చేయగా ఒక బెల్ట్ షాపు నుండి34 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఒకర్నిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ డి.పద్మావతి తెలిపారు. సీతానగరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గరుగుబిల్లి , బలిజిపేట, సీతానగరం మండలాల్లో ఎటువంటి బెల్ట్ షాపులు, నాటు సారాయి విక్రయాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహణ, నాటు సారాయి అమ్మకాలు సమాచారం 9440902373 నెంబర్ కి కాల్ చేసి ఇవ్వాలని సమాచారం కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడును తెలిపారు. ఈ సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.